సాక్షి
సూర్యాపేట
మంగళవారం । 3 । జనవరి । 2023

న్యూస్‌రీల్

అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట రూరల్: అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సూర్యాపేట పట్టణ పరిధిలోని పిల్లలమర్రిలోని ఎస్‌జీఆర్‌ఎస్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్‌ను తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సారంగపాని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గడ్డం వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్స్‌గా తోము హనుమంతరావు, మందడి కిరణ్‌కుమార్, ప్రమీల, జాయింట్ సెక్రటరీలుగా మీసాల శ్రీనివాసులు, చెరుకు వెంకటేష్, మధుసూదన్‌రెడ్డి, మేరే సునీత, ట్రెజరర్‌గా లొడంగి సైదులు, సభ్యులుగా కార్తీక్‌రెడ్డి, పరమేష్, నాగరాజు, అనిత, ప్రదీప్, కరుణాకర్, హరీష్, మహేష్ ఎన్నికైనట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సారంగపాని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకుడు మనోజ్‌కుమార్, రిటర్నింగ్ అధికారి రత్నయ్య పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేట క్రైం: పోలీస్ గ్రీవెన్స్ డేలో ప్రజలు అందించిన ఫిర్యాదులపై అధికారులు సత్వరమే స్పందించాలని ఎస్పీ రాజేంద్రప్రసాదర్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించి గ్రీవెన్స్‌డేలో ప్రజల నుంచి ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తొమ్మిది ఫిర్యాదులు స్వీకరించినట్లు తెలిపారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశానన్నారు.


కమిషనర్‌గా రామానుజుల రెడ్డి బాధ్యతల స్వీకరణ



సూర్యాపేట : సూర్యాపేట మున్సిపల్ కమిషనర్‌గా పెద్దబల్లి రామానుజులరెడ్డి సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడే పనిచేసి అంబర్‌పేట మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయిన రామానుజులరెడ్డి తిరిగి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డిని కలిసి కొత్తసంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు బాషా, రాపర్తి శ్రీను, అనంతుల యాదగిరి, మున్సిపాలిటీ అధికారులు ఈఈ జీకేడీ ప్రసాద్, మేనేజర్ మున్వర్ అలీ, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీను, టీపీఓ శైలజ, ఆర్‌ఓ జానేశ్వరి, ఎండీ గౌసుద్దీన్, ఎస్‌ఎస్‌ఆర్ ప్రసాద్, శివరాం రెడ్డి, అజీముద్దీన్, మనోజు పాల్గొన్నారు.

నేడు సైలెన్స్ రిట్రీట్ సెంటర్ ప్రారంభం

- వర్చువల్ ద్వారా ప్రారంభించనున్న రాష్ట్రపతి



ప్రారంభానికి సిద్ధమైన సైలెన్స్ రిట్రీట్ సెంటర్

బీబీనగర్ : మండలంలోని మహాదేవ్‌పురం పరిధిలో గల ఆధ్యాత్మిక శాంతి కేంద్రమైన బ్రహ్మకుమారీస్ భవనంలో ఏర్పాటు చేసిన సైలెన్స్ రిట్రీట్ సెంటర్ ప్రారంభానికి సిద్ధమైంది. ఈ కేంద్రాన్ని మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రాజస్తాన్ నుంచి వర్చువల్ ద్వారా ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారని పేర్కొన్నారు. సాయంత్రం 4.30కి ఆమె మహాదేవపురం చేరుకోనున్నారు. గవర్నర్‌తో పాటు మంత్రి జగదీశ్‌రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు.

వైకుంఠ వైభవం



మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గరుడవాహనంపై ఊరేగుతున్న స్వామివారు



ముక్కోటి ఏకాదశి సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉత్తర ద్వారం నుంచి వైకుంఠనాథుడిని దర్శించుకుంటున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) ముస్తాబైన శ్రీగోదా పద్మావతి సమేత శ్రీనివాసుల ఉత్సవ మూర్తులు

బొమ్మలు చేస్తాం.. పాఠాలు నేర్చుకుంటాం

- నేడు, రేపు టీఎల్‌ఎమ్ మేళాలు
- మొదటి రోజు 11, రెండో రోజు 12 మండల కేంద్రాల్లో నిర్వహణ
- 709 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 31,927మంది విద్యార్థులు
- ప్రతీ స్కూల్ నుంచి కనీసం రెండు టీఎల్‌ఎమ్‌ల ప్రదర్శన
- జిల్లాస్థాయికి 46 ఎంపిక చేయనున్న అధికారులు



రామ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో టీఎల్‌ఎమ్ చేయిస్తున్న హెచ్‌ఎం వెంకయ్య

చిలుకూరు : సాధారణంగా ఉపాధ్యాయులు క్లాసులో బోర్డును ఉపయోగించి బోధిస్తే విద్యార్థులు అంతంత మాత్రమే అర్థం చేసుకుంటారు. అదే బొమ్మలతో సులభంగా ఆకళింపు చేసుకుంటారు. అందువల్ల ఈ విధానాన్ని తరగతి గదిలో అమలు చేసేందుకు విద్యాశాఖ టీఎల్‌ఎమ్ (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) మేళాలు నిర్వహిస్తోంది. ప్రాథమిక స్థాయిలో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమాన్ని చేట్టింది. దీని కోసం కృత్యాధార బోధనే ఉత్తమ మార్గమని గుర్తించింది. విద్యార్థికి బోధనోపకరణాల ద్వారా బోధిస్తే అన్ని విషయాలు తేలికగా అర్థం చేసుకుంటారని గ్రహించింది. ఇందులో భాగంగా అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులతో టీఎల్‌ఎమ్ తయారు చేయించారు. జిల్లాలో నేటి నుంచి రెండు రోజులు పాటు నిర్దేశించిన తేదీల్లో మండలాల్లో టీఎల్‌ఎమ్ మేళాలు నిర్వహించనున్నారు.

నిర్వహణ ఇలా..

జిల్లాలో 631 ప్రాథమిక, 78 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 31,927 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. బడిలో విద్యార్థులతో ఉపాధ్యాయులు టీఎల్‌ఎమ్ తయారు చేయించారు. ఇలా తయారు చేయించిన వాటిని ప్రతి స్కూల్ నుంచి కనీసం రెండు నుంచి 4 వరకు మండల కేంద్రాల్లో నిర్వహించే మేళాకు తీసుకెళ్లాలి. వీటిలో నుంచి ప్రతి మండలం నుంచి రెండు చొప్పున జిల్లా స్థాయికి మొత్తం 46 ఎంపిక చేస్తారు. వీటిలో 10 బెస్ట్ టీఎల్ఎంలను గుర్తించి రాష్ట్ర స్థాయికి పంపించాల్సి ఉంటుంది. పిల్లలు విషయాన్ని తేలికగా అర్థం చేసుకునేలా, ఆకర్షించేలా టీఎల్‌ఎమ్ ఉండాలి. అన్ని స్కూళ్ల నుంచి బొమ్మలు రావడంతో ఉపాధ్యాయులు వీటిని తిలకించడం వల్ల ఆ తరువాత మరిన్ని తయారు చేసుకొని వీటి ద్వారా బోధించే అవకాశముంటుంది.

మేళాలు నిర్వహించే మండలాలు

3వ తేదీ	4వ తేదీ
చిలుకూరు	అనంతగిరి
మునగాల	కోదాడ
నడిగూడెం	హుజూర్‌నగర్
గరిడేపల్లి	మఠంపల్లి
నేరేడుచర్ల	పాలకవీడు
చివ్వెంల	జాజిరెడ్డిగూడెం
మోతె	సూర్యాపేట
నాగారం	పెన్‌పహాడ్
తుంగతుర్తి	తిరుమలగిరి
నూతనకల్	ఆత్మకూరు(ఎస్)
మేళ్లచెర్వు	మద్దిరాల
	చింతలపాలెం

విద్యార్థులకు ఎంతో ఉపయోగం



"సాధారణ బోధన, బోర్డులపై బొమ్మలు గీసి చెప్పే పాఠాల కన్నా బోధనోపకరణాలతో బోధించే పాఠాలు విద్యార్థులను ఆకట్టుకుంటాయి. ఇవి వారి మనసులో నిక్షిప్తమై ఉండటంతో పాటు తేలికగా అర్థం చేసుకుంటారు. జిల్లాలో రెండు రోజుల పాటు టీఎల్‌ఎమ్ మేళాలు నిర్వహిస్తున్నాం.

– దేవరశెట్టి జనార్దన్, జిల్లా సెక్టోరియల్ అధికారి

అభ్యసన వేగవంతం..

టీఎల్‌ఎమ్ ఉపయోగిస్తే చిన్నారులకు ప్రత్యక్ష అనుభవం కలుగుతుంది. దీంతో అభ్యసన వేగవంతం అవుతుంది. బోధనకు తక్కువ సమయం తీసుకోవడంతో పాటు వివిధ విషయాలపై ఒకే సారి అవగాహన పెంపొందుతుంది. ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉన్న చోట బహుళ తరగతి బోధనకు ఇది ఉపయుక్తంగా ఉంటుంది. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కాకుండా ఉంటారు.

చట్టాలపై అవగాహనకు లీగల్ సర్వీస్ అథారిటీ

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గౌతం ప్రసాద్



జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

చివ్వెంల(సూర్యాపేట) : ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకే జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.గౌతం ప్రసాద్ అన్నారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో తెలంగాణ హైకోర్టు ఏర్పాటు తర్వాత జిల్లా కోర్టులో జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కేంద్రాలను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్వల్ భూయాన్ ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన లీగల్ సెల్ అథారిటీ కేంద్రాన్ని జిల్లా జడ్జి ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఈ సేవ ద్వారా అడ్వకేట్‌ను పెట్టుకోలేని స్థితిలో ఉన్న పేదలకు న్యాయవాదిని ఏర్పాటు చేసి వారికి న్యాయం అందేలా చూస్తారని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి చట్టాలపై అవగాహనతో పాటు, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే పడే శిక్షలను వివరించనున్నట్లు తెలిపారు. జిల్లా లీగల్ సెల్ అథారిటీ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణిని నియమించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు న్యాయమూర్తి ప్రేమలత, జూనియర్ సివిల్ జడ్జిలు సురేష్, జె.ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి సీనపల్లి సోమేశ్వర్, హైకోర్టు పీపీ పాటి నాగిరెడ్డి, పీపీలు కాకి రాంరెడ్డి, మీలా రమేష్, లీగల్ సర్వీస్ సభ్యులు జె.శశిధర్, మారపాక వెంకన్న, ఎండిండ్ల అశోక్, సీనియర్ న్యాయవాదులు జటంగి వెంకటేశ్వర్లు యాదవ్, టేకులపల్లి శ్రీనివాస్‌రావు, వసంత సత్యనారాయణ పిళ్లే యాదవ్, మధు, దోరెపల్లి రమేష్, పతంగి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

- కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రజావాణికి అధికారులు తప్పక హాజరు కావాలని, సమయపాలన పాటించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణిలో వివిధ సమస్యలపై 27 దరఖాస్తులు రాగా సంబంధిత శాఖలకు అందించినట్లు తెలిపారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత

ప్రజావాణిలో దివ్యాంగుడు అందజేసిన దరఖాస్తుకు వెంటనే స్పందించిన కలెక్టర్ ట్రై సైకిల్ అందించాలని సంబంధితశాఖ అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సూర్యాపేటలోని కుడకుడ ప్రాంతానికి చెందిన ఎస్. కే. ఖాదర్‌కు అధికారులు వెంటనే ట్రై సైకిల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణ పనులను పూర్తి చేయాలి

పెన్‌పహాడ్ : మన ఊరు–మనబడి కార్యక్రమం ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులు సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ ఆదేశించారు. సోమవారం మండల పరిధిలోని లింగాల, తంగెళ్లగూడెం ప్రాథమిక పాఠశాలల్లో మన ఊరు–మనబడి కార్యక్రమం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఊరు–మనబడి కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తోందన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సంబంధిత శాఖల అధికారులు పనులు నిర్వహించి విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటునందించాలని ఆయ న కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు బాదె ఈశ్వరమ్మధర్మయ్య, మామిడి వెంకన్న, డీఈఓ అశోక్, ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, పీఆర్‌ఈ గోపి, ఎంఈఓ నకిరేకంటి రవి, ఎంపీఓ నరేష్, ప్రధానోపాధ్యాయులు సీహెచ్. రాములు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్



సూర్యాపేట పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు

భానుపురి (సూర్యాపేట) : స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలపై రాష్ట్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ టీపీసీసీ రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చేపట్టిన కార్యక్రమానికి వెళ్లకుండా సోమవారం జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఇచ్చిన రూ.35 వేల కోట్లను దొంగ చాటుగా వేరే అకౌంట్లకు బదిలీ చేసిందన్నారు. గ్రామ పంచాయతీలకు ప్రతి నెలా స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి మౌలిక సదుపాయాల కల్పన, జీత భత్యాలు, అత్యవసరాల కోసం విడుదల చేయాల్సిన రూ.250 కోట్లను 7 నెలలుగా నిలిపివేయడంతో గ్రామ పంచాయతీల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ శైలేందేర్ గౌడ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, కౌన్సిలర్ మడిపల్లి విక్రమ్, జిల్లా కాంగ్రెస్ ఓబీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మద్ది శ్రీనివాస్ యాదవ్, డీసీసీ కార్యదర్శులు పిడమర్తి మల్లయ్య, అక్కేనపల్లి జానయ్య, ఐఎన్‌టీయూసీ పట్టణ అధ్యక్షుడు వల్దాసు శ్రీను(రెబల్), పట్టణ ఓబీసీ సెల్ అధ్యక్షుడు రావుల రాంబాబు, జిల్లా కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ యలగందుల సాయినేత, సేవా దళ్ చీఫ్ ఆలేటి మాణిక్యం, నాయకులు గడ్డం వెంకన్న, నరేందర్ నాయుడు, అన్నమయ్య రాము, చెరుకు రాము, సందు రాము,పేర్ల గిరియాదవ్, చింతల నాగరాజు, వెంకన్న, కోడి శివ తదితరులు పాల్గొన్నారు

న్యూ ఇయర్ కిక్కు

అర్వపల్లి : నూతన సంవత్సర వేళ మందుబాబులు తెగతాగేశారు. ఏడాది చివరి రెండు రోజులు జిల్లా వ్యాప్తంగా రూ.14.50 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. జిల్లాలో 99 మద్యం దుకాణాలు (వైన్స్), 22 బార్లు ఉన్నాయి. ఈ దుకాణాల ద్వారా రోజుకూ రూ. 5కోట్ల వరకు మద్యం అమ్మకాలు జరుగుతుంటాయి. సాధారణంగా రెండు రోజులకు రూ.10కోట్ల వరకు మద్యం అమ్మకాలు జరగుతుంటాయి. డిసెంబర్ 30, 31 తేదీల్లో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రూ. 14.50 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. అంటే రూ. 4.50 కోట్ల అమ్మకాలు అదనంగా పెరిగాయి. రెండు రోజుల్లో 14వేల కేసుల లిక్కర్, 7వేల కేసుల బీర్ల అమ్మకాలు జరిగినట్లు ఎక్సైజ్ అధికారులు చెప్పారు.

మోడల్ కాలనీని త్వరగా పూర్తి చేయాలి

- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



అసంపూర్తిగా ఉన్న మోడల్ కాలనీని పరిశీలిస్తున్న ఎంపీ ఉత్తమ్

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ శివారులోని మోడల్ కాలనీ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణ శివారులో అసంపూర్తిగా ఉన్న మోడల్ కాలనీని ఉత్తమ్ స్థానిక నాయకులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మంత్రులు వచ్చినప్పుడు మోడల్ కాలనీలో మిగిలిన పనులు పూర్తి చేయాలని తాను విజ్ఞప్తి చేసినట్లు గుర్తు చేశారు.కాంట్రాక్టు కమీషన్‌ల కోసమే మోడల్ కాలనీ, ఇతర అభివృద్ధి పనులను జరగనీయడం లేదని ఉత్తమ్ ఆరోపించారు. ఇది కూడా అలా కాకుండా వెంటనే పూర్తి చేసి 2 వేల మంది లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని ఆయన కోరారు.

ఈఎస్ఐ డిస్పెన్సరీని అప్‌గ్రేడ్ చేయించేందుకు కృషి

ఈఎస్ఐ (ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్) డిస్పెన్సరీని అప్‌గ్రేడ్ చేయించేందుకు కృషి చేస్తానని ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు. హుజూర్‌నగర్‌లోని ఈఎస్ఐ డిస్పెన్సరీని సోమవారం ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మిల్లులు, సిమెంట్ పరిశ్రమల కార్మికులు ఎక్కువగా ఉన్నందున ఈఎస్ఐ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పెట్టాలని తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ప్రపోజల్ పెట్టడంతో డిస్పెన్సరీ ఇచ్చారన్నారు. ఈఎస్ఐ డిస్పెన్సరీని హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేయించేందుకు పార్లమెంట్‌లో, బయట కూడా మాట్లాడుతానన్నారు. గతంలో డిస్పెన్సరీలో సిబ్బంది నియామకాల్లో జరిగిన అవినీతి అవకతవకలపై, మాన్ పవర్ ఏజెన్సీ కుంభకోణం వెనుక ఎవరు ఉన్నారో తేల్చాలని రాష్ట్ర, కేంద్ర విజిలెన్స్‌కు, ఏసీబీకి ఫిర్యాదు చేస్తామని ఉత్తమ్ చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు దొంగరి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు కస్తాల శ్రవణ్ కుమార్, కోతి సంపత్‌రెడ్డి, రాజా నాయక్, సర్పంచ్ నాగసైదయ్య, నాయకులు వి వీరారెడ్డి, జైలు, నాగరాజు, వెంకన్న, మంజూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశం నుంచే హాజరు

ఉదయం, సాయంత్రం ఆన్‌లైన్‌లో నమోదు

- ఉపాధి పనుల నిర్వహణలో పారదర్శకతకు కేంద్రం కొత్త విధానం
- ఈనెల నుంచే అమలులోకి



పని ప్రదేశంలో ఉపాధి కూలీలు (ఫైల్)

హుజూర్‌నగర్ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలను అరికట్టి పనులు పారదర్శకంగా జరిగేలా కేంద్రం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పని ప్రదేశం నుంచే కూలీల హాజరును నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్‌ఎంఎంఎస్) యాప్‌లో నమోదు చేసేలా కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. ఈనెల నుంచే దీనిని అమలు చేస్తున్నారు. ఉన్న ఊరిలోనే కూలీలకు పని కల్పించాలని వలసలు అరికట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. వ్యవసాయ క్షేత్రాలను చదును చేయడం, రోడ్ల అభివృద్ధి, చెరువులు, కుంటలు, బావుల్లో పూడికతీత, హరితహారంలో నర్సరీల అభివృద్ధి మొదలుకొని మొక్కలు నాటి రక్షణ కంచెలు ఏర్పాటు చేయడం తదితర పనులు ఉపాధిహామీలో నిర్వహిస్తున్నారు. ఇందులో ఉన్న కొన్ని లొసుగులను ఆసరాగా చేసుకుని కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. వీటిని కట్టడి చేసి, కూలీల హాజరు పక్కాగా నమోదు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.

6,31,156 మంది కూలీలు..

జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద 2,71,992 జాబ్ కార్డులు ఉండగా 6,31,156 మంది కూలీలు నమోదై పనులు చేస్తున్నారు. వ్యవసాయ పనులు పూర్తి అయిన తర్వాత గ్రామీణ కూలీలకు జాతీయ ఉపాధిహామీ పథకం భరోసా కల్పిస్తోంది.

జాబ్‌కార్డులు	నమోదై ఉన్న కూలీలు
2,71,992	6,31,156 మంది
కల్పించిన పనిదినాలు 60,44,886	
వంద రోజుల పనిదినాలు పూర్తి చేసిన కుటుంబాలు 496	

ఎన్ఎంఎంఎస్ తప్పనిసరి..

ఉపాధిహామీ పథకం కింద పక్కాగా కూలీలకు పని కల్పించాలన్న ప్రధాన ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం(ఎన్ఎంఎంఎస్) యాప్‌ను జనవరి నెల నుంచి తప్పని సరిగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే పది మంది సభ్యులకు ఒక మస్టర్‌గా ఏర్పాటు చేశారు. వచ్చిన వారు అక్కడ చేస్తున్న పని వివరాలను పని చేస్తున్న ప్రదేశం నుంచే సెల్ ఫోన్‌లో వారి ఫొటో తీసి ఎన్ఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అలాగే పని పూర్తి అయిన తర్వాత ఇంటికి వెళ్లే సమయంలో కూడా మరొక ఫొటోను పంపాల్సి ఉంటుంది. ఉదయం 11 గంటల లోపు మొదటి ఫొటో పంపాలి. ఆ తర్వాత రెండో ఫొటోను సాయంత్రం 3 గంటలకు ఆన్‌లైన్‌లో పంపాల్సి ఉంటుంది. ఒక మస్టర్‌లో ఒకరిద్దరు పనికి వచ్చినా వారి హాజరును పంపాల్సి ఉంటుంది. వీటి బాధ్యతను సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లకు అప్పగించారు. అయితే ఈ విధానాన్ని జనవరి నుంచి తప్పని సరిగా చేయాలని ప్రభుత్వం పేర్కొంది. ఈనేపథ్యంలో కూలీల హాజరు పక్కాగా తెలియడమే కాకుండా పారదర్శకత పెరిగే అవకాశం ఉంది.

హాజరు నమోదు చేయకపోతే వేతనం రాదు



"ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి ఒకటి నుంచి గ్రామ పంచాతీల పరిధిలో కనీసం ఒక్కరు ఉపాధిహామీ పనికి వచ్చినా విధిగా నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్‌లో హాజరు నమోదు చేయాలి. లేని పక్షంలో వారు పని చేసినా వేతనం చెల్లించడానికి అవకాశం లేదు. పథకం అమలు పూర్తి పారదర్శకంగా ఉంటుంది. ఎలాంటి అవకతవకలకు అవకాశం ఉండదు. ఈ విషయమై ఉపాధి సిబ్బందికి అవగాహన కల్పించాం.

– డాక్టర్ పెంటయ్య, అడిషనల్ పీడీ, డీఆర్‌డీఏ

క్లుప్తంగా

వ్యక్తి మృతదేహం లభ్యం

గరిడేపల్లి: మిర్యాలగూడ పట్టణానికి చెందిన గుంటి శివరామకృష్ణ శుక్రవారం తన భార్యతో గొడవపడి నందిపాడు సమీపంలోని సాగర్ కాలువలో దూకగా, సోమవారం గరిడేపల్లి మండలంలోని పానుగోడు రిజర్వాయర్‌లో అతడి మృతదేహం లభ్యమైంది. స్థానిక రైతులు రిజర్వాయర్‌లో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా.. శివరామకృష్ణ తమ్ముడు యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొండల్‌రెడ్డి తెలిపాడు. మృతుడి భార్య కూడా శుక్రవారం గొడవ జరిగిన రోజే ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు.

'శ్రీని'లో అగ్నిప్రమాదం.. కెమిస్ట్‌కు గాయాలు

చౌటుప్పల్: పట్టణ శివారులోని శ్రీని ఫార్మాస్యూటికల్ కంపెనీలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయని ఎస్‌ఐ సైదులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలం గజలాపురం గ్రామానికి చెందిన ఉగ్గిడి సాయికుమార్(25) శ్రీని పరిశ్రమలో కెమిస్ట్‌గా పని చేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా శనివారం నైట్ డ్యూటీకి వెళ్లాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత రియాక్టర్ వద్ద వాల్వ్ తిప్పుతుండగా అధిక పీడనం ఏర్పడి మంటలు చెలరేగాయి. దీంతో సాయికుమార్‌కు మంటలు అంటుకొని గాయాలయ్యాయి. అతడిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గరిడేపల్లి: జీవితంపై విరక్తితో పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని గానుగుబండ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కొండల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గానుగుబండ గ్రామానికి చెందిన తాళ్ల శ్రీను(50) భార్య 12ఏళ్ల క్రితం మృతిచెందింది. అప్పటి నుంచి అతడు మద్యానికి బానిస అయ్యాడు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీను జీవితంపై విరక్తి చెంది ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత చుట్టుపక్కల వారు గమనించి అతడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి తల్లి పున్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.

దాడి కేసులో ఐదుగురు అరెస్టు

నకిరేకల్: ప్రేమ పెళ్లి చేసుకున్న యువకుడి ఇంటిపై దాడి చేసి అమ్మాయి తీసుకెళ్లిన కేసులో ఐదుగురిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్‌లోని బొడ్రాయి బజార్‌లో నివాసముంటున్న తాడూరి నవదీప్, శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామానికి చెందిన వరికుప్పల కావ్యను డిసెంబర్ 29న నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు క్షేత్రంలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న అమ్మాయి తండ్రి వరికుప్పల వెంకన్నతో పాటు మరికొంత మంది మరుసటి రోజు నవదీప్ ఇంటిపై దాడి చేసి అతడిని గాయపర్చి కావ్యను తమ వెంట తీసుకెళ్లారు. ఈ మేరకు నవదీప్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అమ్మాయి తండ్రి వరికుప్పల వెంకన్నతో పాటు ఓర్సు యాదగిరి, వి. నరేష్, ఎస్. శ్రీకాంత్, షేక్ జహంగీర్‌ను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

వైకుంఠ వైభవం..

- యాదాద్రి ఆలయ ఉద్ఘాటన తర్వాత తొలిసారిగా వేడుక
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



స్వామి సేవలో మంత్రి జగదీశ్‌రెడ్డి కుటుంబ సభ్యులు, ప్రభుత్వ విప్ సునీత



ఉత్తర రాజగోపురం వద్ద వైకుంఠ ద్వార దర్శనమిస్తున్న లక్ష్మీనరసింహస్వామి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహుడు సోమవారం భక్తులకు వైకుంఠనాథుడిగా దర్శనమిచ్చారు. యాదాద్రీశుడి ప్రధానాలయ ఉత్తర ద్వారం గుండా భక్త జనులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 6.30గంటలకు గరుడ వాహనంపై వైకుంఠ నాథుడిగా శ్రీనరసింహస్వామిని అలంకరించి అమ్మవారిని, ఆళ్వారాధులను అలంకార సేవలతో ప్రధానాలయం నుంచి ఉత్తర ద్వారం వద్దకు తీసుకువచ్చి పంచారాత్రా ఆగమశాస్త్ర ప్రకారం పూజలు నిర్వహించారు. ఉదయం 6.48గంటలకు నారసింహుడు ఉత్తర ద్వారం వద్ద వైకుంఠనాథుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు ఉదయం 3గంటలకు ఆలయం తెరచి సుప్రభాతం, ప్రాతఃకాల తిరువారధన, ధనుర్మాస తిరుప్పావై సేవా కాలం, బాలభోగం, ఆరగింపు, చాత్మురై వంటి పూజలు జరిపించి, 5.15గంటల నుంచి 6.30గంటల వరకు శ్రీస్వామిని గరుడవాహనంపై పరవాసుదేవ అలంకారం (శ్రీలక్ష్మీనృసింహస్వామి) సేవలో ఊరేగిస్తూ 6.48గంటలకు ఉత్తర ద్వారం గుండా ద్వార భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సమయంలో ఆచార్యుల వేదమంత్రాలతో యాదాద్రి కొండ మార్మోగిపోయింది. భక్తులు యాదాద్రీశా.. జై లక్ష్మీనారసింహా అంటూ నినాదాలు చేశారు. అనంతరం తిరువీధుల్లో సేవను ఊరేగించారు.

పాతగుట్టలో...

యాదాద్రి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉత్తర ద్వారంలో నృసింహుడు వైకుంఠనాథుడిగా దర్శనమించారు. వేకువజామున ఆలయాన్ని తెరచిన ఆచార్యులు శ్రీ స్వామి అమ్మవార్లకు సుప్రభాతం, ఆరాధన చేపట్టారు. వైకుంఠనాథుడిగా శ్రీస్వామిని అలంకరించి గరుడవాహనంపై ప్రత్యేక సేవలో ఉత్తర ద్వారంకు తీసుకువచ్చారు. సరిగ్గా ఉదయం 6.48 గంటలకు భక్తులకు శ్రీస్వామివారు వైకుంఠనాథుడిగా దర్శనమిచ్చారు. అనంతరం వచ్చిన భక్తులకు క్యూలైన్ ద్వారా ముఖ మండపంలో భక్తులకు స్వామిని దర్శించుకునేందుకు అవకాశం కల్పించారు.



అధ్యయనోత్సవాల్లో సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు, పారాయణీకులు

అధ్యయనోత్సవాలకు శ్రీకారం...

యాదాద్రి ప్రధానాలయంలో అధ్యయనోత్సవాలకు ఆచార్యులు ద్రావిడ ప్రబంధ సేవా కాలం పారాయణీక స్వాములచే శ్రీకారం చుట్టారు. తొళక్కముతో అధ్యయనోత్సవాలను ప్రారంభించారు. శ్రీస్వామి వారిని విష్ణుమూర్తిగా అలంకారం చేసి మత్స్యావతార సేవలో ఆగమశాస్త్రానుసారంగా శ్రీ స్వామి వారిని పురప్పాట్ సేవగా ఊరేగింపు సేవ చేపట్టారు.

ఆకట్టుకున్న సంప్రదాయ నృత్యాలు



ఆలయ తూర్పు రాజగోపురం ముందు నృత్యం చేస్తున్న చిన్నారులు

యాదగిరిగుట్ట: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో సోమవారం సాయంత్రం శ్రీసాంస్కృతిక విశ్వకళా మండలి ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. యాదాద్రీశుడి చరిత్రను తెలిపే పాటలకు అనుగుణంగా చిన్నారులు చేసిన నృత్యాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో కూచిపూడి నాట్య గురువులు డాక్టర్ ఎస్.సి. కృష్ణకుమారి, డాక్టర్ మనోజ్ఞ, సంగీత విద్వాంసులు వెంకటచార్యులు, జ్యోతిర్మయి, విశ్వకళా మండలి వ్యవస్థాపకుడు రాంనర్సయ్య తదితరులున్నారు.

మట్టపల్లి క్షేత్రానికి భక్తజనం



మట్టపల్లి పురవీధుల్లో గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

మఠంపల్లి: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక అర్చనలు నిర్వహించగా, అనంతరం శ్రీరాజ్యలక్ష్మీచెంచులక్ష్మీ సమేతం శ్రీలక్ష్మీనరసింహస్వామి వైకుంఠ (ఉత్తర) ద్వార దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు స్వామివారిని ఉత్తర ద్వారంలోనూ, అదే విధంగా క్యూలైన్ల ద్వారా గర్భాలయంలోనూ దర్శించుకున్నారు. వైకుంఠ ద్వారం నుంచి గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్లను మట్టపల్లి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయంలో లక్ష ఆరెపత్రి పూజను అర్చకులు ఘనంగా నిర్వహించారు. అంతేగాక హరికథలు, బుర్రకథ, పురాణ కాలక్షేపాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు లక్ష్మణా చార్యులు, శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, లక్ష్మీనరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో భక్తుల కిటకిట



స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి దంపతులు, భక్తులు

రామగిరి(నల్లగొండ) : తెలంగాణలో రెండో భద్రాద్రిగా ప్రసిద్ధిగాంచిన నల్లగొండ పట్టణంలోని రామగిరిలో గల శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం (రామాలయం) వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం భక్తులతో కిటకిటలాడింది. నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, భక్తులు స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చకిలం వేణుగోపాల్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు యాట జయప్రద, వేదాంతం శ్రీనివాసాచార్యులు, మిరియాల స్వామి, పాదం ప్రియాంక, హనుమంతు, కక్కిరేణి లక్ష్మీనారాయణ, ఈఓ జిల్లేపల్లి జయరామయ్య పాల్గొన్నారు.

సాగర్ ఎడమ కాల్వలో వ్యక్తి గల్లంతు



లక్ష్మణ్

మిర్యాలగూడ: వేములపల్లి మండలం రావులపెంట గ్రామ శివారులో సాగర్ ఎడమ కాల్వలో సోమవారం ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామానికి చెందిన గౌట్టిపర్తి లక్ష్మణ్(35) 20 సంవత్సరాలుగా నల్లగొండలో నివాసముంటూ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఆటోలో సాగర్ ఎడమ కాల్వ మీదుగా సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దోసపాడు గ్రామానికి వెళ్లాడు. తిరిగి వచ్చే క్రమంలో రావులపెంట గ్రామ శివారులో కాల్వ కట్టపై బహిర్భూమికి వెళ్లి, కాల్వలో దిగగా ప్రమాదవశాత్తు అందులో జారిపడ్డాడు. స్థానికులు గమనించి కాపాడేందుకు ప్రయత్నించగా నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో గల్లంతయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులకు వెంటనే అక్కడకు చేరకుని లక్ష్మణ్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. లక్ష్మణ్ భార్య రెండేళ్ల క్రితమే చనిపోగా, ఒక కుమారుడు ఉన్నాడు.

తాళం వేసిన ఇంట్లో దొంగతనం

- 8తులాల బంగారు ఆభరణాలు చోరీ

హుజూర్‌నగర్ (చింతలపాలెం): తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి 8తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన సంఘటన చింతలపాలెంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం గ్రామానికి చెందిన ఉస్తెల పెద్దవెంకటరెడ్డి ఉదయం 10గంటల సమయంలో ఇంటికి తాళం వేసి గ్రామంలోని తన తమ్ముడి మనవరాలి అన్నప్రాసన కార్యక్రమానికి వెళ్లాడు. తిరిగి మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండటం గమనించి లోపలికి వెళ్లి చూడగా, గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న సుమారు 8తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మద్యం మత్తులో యువకుల దాడి

- గోపలాయపల్లిలో విచారణ చేపట్టిన పోలీసులు



గోపలాయపల్లి గ్రామంలో విచారిస్తున్న సీఐ శివరాంరెడ్డి, ఎస్‌ఐ రామకృష్ణ

నార్కట్‌పల్లి: మండలంలోని గోపలాయపల్లి గ్రామంలో ఏడుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి గోపలాయపల్లి గ్రామంలో కొందరు యువకులు మద్యం మత్తులో పలువురిపై దాడి చేశారు. దీంతో గ్రామానికి చెందిన దేశగాని పురుషోత్తం, శ్రవణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సోమవారం సీఐ శివరాంరెడ్డి, ఎస్‌ఐ రామకృష్ణ గ్రామంలో విచారణ చేపట్టి వివరాలు సేకరించారు. దాడి చేసింది గాలి వేణు, పోషలు, తేజ, వినయ్, మచ్చ వేణు, చక్రి, అరిగెల శివగా గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు. యువకులు మద్యానికి బానిస కాకుండా కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సీఐ శివరాంరెడ్డి తెలిపారు.

ఆర్టీసీ బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదం



హిల్‌కాలనీ డౌన్‌లో రోడ్డు దిగి గట్టు పైకి ఎక్కి ఆగిన బస్సు

నాగార్జునసాగర్: ఆటోను తప్పించబోయిన ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కకు వెళ్లి ఆగిపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆర్టీసీ బస్సు సోమవారం నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీ నుంచి పైలాన్ వెళ్తుండగా, ఇందిరమ్మ విగ్రహం దాటాక రోడ్డుపై లారీ ఆగి ఉంది. అదే సమయంలో ఎదురుగా ఆటో రావడంతో ఆటో తప్పించపోయిన బస్సు డ్రైవర్ బస్సును రోడ్డు పక్కకు తీసుకెళ్లడంతో అది గట్టు పైకి ఎక్కింది. ఏమాత్రం కొంత ముందుకు కదిలితే బస్సు రోడ్డుపై పడిపోయేదని ప్రయాణికులు తెలిపారు. ఈ ఘటన జరిగిన సమయంలో బస్సులో 60మంది ప్రయాణికులు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి వచ్చి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

పోలీస్ ఈవెంట్స్‌లో 559మంది ఎంపిక

నల్లగొండ క్రైం: పోలీసు ఉద్యోగాల భర్తీలో భాగంగా పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు చెందిన అభ్యర్థులకు నిర్వహిస్తున్న ఈవెంట్స్‌లో సోమవారం 559మంది ఎంపికయ్యారు. మొత్తం 1332మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 1159మంది హాజరయ్యారు. ఈవెంట్స్‌ను స్పెషల్ ఎస్పీ శబరీష్ పర్యవేక్షించారు.

యువకుడి దారుణ హత్య

- తలపై ఇనుప పైపుతో కొట్టి చంపిన నిందితుడు
- అసభ్య పదజాలం ఉపయోగించి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలపడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం
- తడకమళ్ల గ్రామంలో ఘటన



సుధాకర్ (ఫైల్)

మిర్యాలగూడ టౌన్: అసభ్య పదజాలం ఉపయోగించి న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెప్పడంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి యువకుడి హత్యకు దారితీసిన ఘటన మిర్యాలగూడ మండలంలోని తడకమళ్ల గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తడకమళ్ల గ్రామానికి చెందిన జంగాల నర్సయ్య, నర్సమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు సంతానం. నర్సయ్య గతంలోనే చనిపోగా, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడి పెళ్లిళ్లు అయ్యాయి. చిన్న కుమారుడు జంగాల సుధాకర్ (28) సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పీవీసీ పైపుల కంపెనీలో పనిచేస్తూ తల్లికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. సుధాకర్ ఆదివారం రాత్రి 10గంటల సమయంలో తన స్నేహితులు ఎర్ర నాగరాజు, ఎర్ర భానుతో కలిసి తడకమళ్ల గ్రామ బస్టాండ్ వద్దకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలోనే తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన చిటికెల సోమయ్య కుమారుడు మల్సూర్ పాత పరిచయంతో సుధాకర్‌ను అడ్డగించి అసభ్య పదజాలం ఉపయోగించి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పాడు. సుధాకర్ కూడా అదే రీతిలో అసభ్య పదజాలం ఉపయోగించి మల్సూర్‌కు తిరిగి శుభాకాంక్షలు చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్యన మాటామాట పెరిగి వాగ్వాదం జరిగింది. అనంతరం సుధాకర్ తన స్నేహితులు నాగరాజు, భానుతో కలిసి నడుచుకుంటూ ఇంటి వైపు వెళ్తుండగా మద్యం మత్తులో ఉన్న మల్సూర్ వెనుక నుంచి వెళ్లి ఇనుప పైపుతో సుధాకర్ తలపై గట్టిగా కొట్టడంతో అతడు అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఇది చూసిన సుధాకర్ స్నేహితులు ఒక్కసారిగా కేకలు వేయడంతో మల్సూర్ పరారయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న సుధాకర్ తల్లి ఘటనా స్థలం వద్దకు చేరుకుని స్థానికుల సహకారంతో 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే సుధాకర్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తల్లి నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మిర్యాలగూడ రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ..

హత్య జరిగిన విషయం తెలుసుకున్న మిర్యాలగూడ డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సీఐ సత్యనారాయణ తడకమళ్ల గ్రామానికి వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడి వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముందు జాగ్రత్తగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తడకమళ్లలో వాడపల్లి ఎస్‌ఐ రవికుమార్, , తక్కెళ్లపాడులో మాడుగులపల్లి ఎస్‌ఐ నరేష్ ఆధ్వర్యంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేయించారు. నిందితుడు మల్సూర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

మాల మహానాడును బలోపేతం చేస్తాం

- సంఘం రాష్ట్ర కార్యదర్శి పిడతల శ్రీనివాస్



శంకర్‌రావుకు నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్

కోదాడ అర్బన్: తెలంగాణలో మాల మహానాడును మరింత బలోపేతం చేస్తామని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి పిడతల శ్రీనివాస్ అన్నారు. సోమవారం కోదాడలో ఏర్పాటు చేసి మాలమహానాడు ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం పట్టణ మాల మహానాడు కమిటీ అధ్యక్షుడిగా పిడతల శంకర్‌రావును నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లచ్చిమల్ల రామ్మోహన్‌రావు, అంబేడ్కర్ మాలమిత్ర అసోసియేషన్ అధ్యక్షుడు మున్సిపల్ డీఈ లచ్చిమల్ల పిచ్చయ్య, వాస్తు రేఖ నాగేశ్వరరావు, హనుమంతరావు, పాలడుగు నాగరాజు, అంబేడ్కర్ యూత్ సభ్యులు లచ్చిమల్ల అంజి, ప్రవీణ్, ఉపేందర్, వంశీ, శివ, జాన్, పుల్లయ్య, నాగార్జున, కిరణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం పన్నులు వసూలు చేయాలి

చివ్వెంల (సూర్యాపేట) : గ్రామాల్లో నూరుశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని డీఎల్‌పీఓ సాంబిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పాశ్యానాయక్ తండా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి మాట్లాడారు. క్యాష్ బుక్ రాయకుండా చెక్ చెల్లింపులు చేయవద్దన్నారు. పల్లె ప్రకృతి వనాలు పరిశుభ్రంగా చూడాలన్నారు. మండల స్థాయి అధికారి విజిట్ తర్వాత గ్రామాల్లో మార్పులు ఉండాలని సూచించారు. నెలకోసారి గ్రామ పంచాయతీ కార్యదర్శి సమావేశం నిర్వహించాలని, కోరమ్ సరిపడా లేకపోతే మరుసటి రోజు నిర్వహించాలన్నారు. ఇంటి పన్నుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ. టి.గోపి, పంచాయతీ కార్యదర్శి గణపరాపు మధు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

కోదాడ అర్బన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతలు వెంటనే చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యకుడు పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎన్.నాగేశ్వర్‌రావు, పొరస్పందన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కేపీ. మంగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో టీఎస్ యుటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను, డైరీలను వారు ఆ సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. పదవ తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్‌లో ప్రభుత్వమే అల్పాహారం ఏర్పాటు చేయాలన్నారు. మన ఊరు- మనబడి నిధులు మంజూరు చేయాలన్నారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఆడిట్ కమిటీ సభ్యులు జనార్దన్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, కృష్ణయ్య, వివిధ మండలాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌తో సమస్యలు పరిష్కారం

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

ఆలేరు రూరల్: ప్రజా దర్బార్ ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తోందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నాలుగు చక్రాల వాహనాలు కలిగిన ఉన్నారనే కారణంగా తమకు ఆసరా పింఛన్ నిలిపివేశారని పలువురు ప్రజా దర్బార్ దృష్టి తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఈ సమస్యలను డీఆర్‌డీఓ ఉపేందర్ రెడ్డికి వివరించగా విచారణ జరిపారని, నియోజకవర్గ వ్యాప్తంగా 159 మంది (గతంలో రిజక్టు అయినవారు) అర్హులుగా తేల్చారని తెలిపారు. దీంతో వారిందరికీ నాలుగు నెలలుగా నిలిచిపోయిన పింఛన్ మొత్తం రూ.13,82,496 వారివారి బ్యాంక్ ఖాతాల్లో సోమవారం జమైందని పేర్కొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాగ్యారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాగ్యారెడ్డి

నేరేడుచర్ల : బీజేపీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రతిఒక్క కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నేరేడుచర్లలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ పట్టణ, మండల శక్తి కేంద్రాల ఇన్‌చార్జిల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో రానున్న ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు సైనికుల్లా పని చేయాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతూనే కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లో తీసుకెళ్లాలన్నారు. ఈ నెల 7న హుజూర్‌నగర్‌లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వర్చువల్‌గా నిర్వహించే సమావేశంలో కార్యకర్తలంతా పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు పార్థనబోయిన విజయ్‌కుమార్, వంగవీటి శ్రీనివాస్‌రావు, నరేష్‌గౌడ్, రామ్మూర్తి, నాగిరెడ్డి, శ్రీనివాస్, రాజేష్‌రెడ్డి, సతీష్, నరేందర్‌రెడ్డి, సత్యం, మధుసూదన్ రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, బగ్గిరెడ్డి, పరమేష్‌రెడ్డి, శ్రీను, వెంకన్న, సతీష్, వెంకట్‌రెడ్డి, వెంకటేశం ఉన్నారు.